
సాక్షి పెద్దపల్లి

సోమవారం, 11, సెప్టెంబర్, 2023



ప్రతిభ ప్రతిబింబించేలా..
విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై ఆసక్తి కలిగించడం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో భారతీయుల కృషి తెలియజేసే ఉద్దేశమే విద్యార్థి విజ్ఞాన్ మంథన్. 8లో▸



అంగన్‌వాడీలకు శుభవార్త
65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ విరమణ ఇవ్వనున్నట్లు తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల: శ్రావణంలో చివరి ఆదివారం కావడంతో ఓదెల మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్నానాలు ఆచరించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గుపూజారులతో పట్నాలు వేయించారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు.

నేడు మల్లన్న సన్నిధిలో లక్షబిల్వార్చన
స్వామివారి ఆలయంలో సోమవారం లక్ష బిల్వార్చన ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో సదయ్య తెలిపారు.

'బుగ్గ'లో శ్రావణ సందడి



దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని ప్రముఖ పర్యాటక క్షేత్రం శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం ఆదివారం భక్తుల తాకిడితో సందడిగా మారింది. శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో బసంత్‌నగర్, పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి, కన్నాలతోపాటు ఎన్టీపీసీ, గోదావరిఖని, రామగుండం, ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

పద్మశాలీలు ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్.రమణ

గోదావరిఖని: పద్మశాలీలు ఏకమై రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో పద్మశాలీ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేతో కలిసి మాట్లాడారు. పద్మశాలీల ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయించింది బీఆర్‌ఎస్ అన్నారు. సీఎం కేసీఆర్ పద్మశాలీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు కౌశిక హరి, అడ్డాల రామస్వామి, బొడ్డు రవీందర్, నూతి తిరుపతి ఉన్నారు.

పలు రైళ్ల కుదింపు.. మరికొన్ని దారి మళ్లింపు

రామగుండం: సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్ మధ్య నడిచే భాగ్యనగర్, ఇంటర్‌సిటీ రైళ్లను బెల్లంపల్లి వరకే కుదించారు. ఖాజీపేట-బల్లార్షా, పెద్దపల్లి-నిజామాబాద్, కరీంనగర్ - సిర్పూర్‌టౌన్, ఖాజీపేట-బల్లార్షా మధ్య నడిచే కాజీపేట ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 27వరకు రద్దు చేశారు. ఖాజీపేట-ముంబయి మధ్య ఈనెల 17, 24తేదీన పెద్దపల్లి-బల్లార్షా-మజ్రీకాదన్-ఆదిలాబాద్-ముద్కేడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉండగా.. పెద్దపల్లి-నిజామాబాద్-ముద్కేడ్ మీదుగా ముంబయి వెళ్లేలా దారి మళ్లించారు. ముంబయి-ఖాజీపేటకు ఈనెల 16, 23 తేదీల్లో నడవనుంది.

సామాన్యుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు



ఇందుర్తిలో మాట్లాడుతున్న విజయ్

ఓదెల: పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెంచుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఆదివారం రాత్రి ఓదెల మండలం ఇందుర్తిలో హాథ్‌సేహాథ్ కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాలు వివరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు పిట్టల రవికుమార్ పాల్గొన్నారు.

మంచంపట్టిన మచ్చుపేట

- లోపించిన పారిశుధ్యం
- ప్రబలుతున్న విషజ్వరాలు
- గ్రామంలో ఓ మహిళ మృతి
- అయినా కన్నెత్తి చూడని అధికారులు



ఈ చిత్రంలో మంచంపై జ్వరంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులు వైద్య రితిక్, సాన్విక. వారంరోజుల క్రితం జ్వరం వచ్చింది. రక్తకణాలూ తగ్గాయి. రీతిక్ రెండో తరగతి, సాన్విక నర్సరీ చదువుతున్నారు. ఇద్దరికీ జ్వరాలు రావడంతో ఇప్పటికే వైద్యం, ల్యాబ్ టెస్టులకు రూ.6వేలు ఖర్చయ్యాయని చిన్నారుల తాత సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రధాన రోడ్డుపై నిలిచిన మురికి నీరు



ఎస్సీకాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



బోరు వద్ద మురికి కాలువ ఇలా..



మచ్చుపేట గ్రామం

ముత్తారం: మారుమూల ప్రాంతమైన మచ్చుపేట మంచంపట్టింది. ఇంటికి ఒక్కరు.. ఇద్దరు చొప్పున విషజ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపించడం.. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లపై వరద చేరి మురికిగా మారి తాగునీరు కలుషితం అవుతోంది. ఫలితంగా పదిరోజుల నుంచి ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. మరికొందరికి రక్తకణాలు తగ్గుతున్నాయి. గ్రామానికి చెందిన పందిళ్ల రాధ (36) విషజ్వరంతో శుక్రవారం రాత్రి మృతిచెందిన విషయం విదితమే. గ్రామంలో పారిశుధ్యం లోపించినా.. విషజ్వరాలు ప్రజలను భయపెడుతున్నా.. ఇప్పటికే ఓ మహిళ చనిపోయినా అధికారులకు గ్రామంవైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులతో స్థానిక ఆర్‌ఎంపీల వద్ద వైద్యం తీసుకుంటున్న వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది. ఈనెల 8న ఓ మహిళ చనిపోవడంతో జ్వర బాధితులంతా కరీంనగర్‌లోని ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. గ్రామంలో సుమారు 1,465 మంది జనాభా ఉంటుంది. సుమారు 350పైగా కుటుంబాలు ఉన్నాయి. 70కి పైగా కుటుంబాలలో ఒకరిద్దరికి రక్తకణాలు తగ్గడం, టైఫాయిడ్, విషజ్వరాల వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. వీరిలో చాలామంది పేదలే ఉన్నారు. ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్యం పొందే అవకాశం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీజనల్ జ్వరాలు వస్తున్నాయి



వాతావరణ పరిస్థితుల కారణంగా గ్రామంలో జ్వరాలు వస్తున్నాయి. మురికి కాలువలను శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నాం. గ్రామంలో జ్వరంతో మహిళ చనిపోవడంతో గ్రామస్తులు భయపడుతున్నారు. అధికారులు ఎవరూ గ్రామానికి రాలేదు. విషయాన్ని వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి శిబిరం ఏర్పాటు చేసేలా చూస్తాం.

– మేడగోని సతీశ్‌గౌడ్, సర్పంచి

చేతిలో చిల్లిగవ్వ లేదు



ఐదారు రోజులుగా జ్వరం వస్తోంది. కూలి పనిచేసుకునే నాకు ప్రైవేట్ వైద్యం చేయించుకునే స్థోమత లేదు. టెస్టులకు చేతిలో చిల్లి గవ్వ లేదు. స్థానిక ఆర్‌ఎంపీల వద్ద చూపెడుకుంటున్నా. జ్వరం తగ్గడం లేదు. దూర ప్రాంతాలలోని సర్కార్ దవాఖానాకు పోలేని పరిస్థితి. నాలాంటి జ్వరబాధితుల కోసం గ్రామంలో క్యాంపు ఏర్పాటు చేసి ఉచిత టెస్టులు, మందులు ఇవ్వాలి.

– అద్దూరి మల్లయ్య, జ్వర బాధితుడు

ఐలమ్మ స్ఫూర్తితోనే మహనీయుల విగ్రహాలు

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మధు

మంథని: నిజాంలకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మంథనిలో తొలుత ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఆ తరువాతే ఇతర మహనీయుల విగ్రహాలను నెలకొల్పామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. వీరనారి ఐలమ్మ 38వ వర్ధంతిని ఆదివారం మంథనిలో నిర్వహించారు. ఆమె విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ఐలమ్మ మనుమడు చిట్యాల రామచంద్రం, ఇతర ప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు. గత పాలకులు మహనీయుల చరిత్ర ప్రజలకు తెలియనివ్వకుండా వారి తండ్రి విగ్రహాలనే పెట్టి.. వారికే మొక్కాలని సూచించారని గుర్తు చేశారు. ప్రజల అభివృద్ధిని కాంక్షించే నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ఎస్సైలు రాణి, దివ్య, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు లింగం అంజలి, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురిని సన్మానించారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ పోతరాజు సమ్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ఎక్కటి అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ప్రజలు గౌరవంగా జీవించాలి
నియోజకవర్గ ప్రజలు గౌరవంగా జీవించాలన్నదే తన ఆకాంక్ష అని పుట్ట మధు అన్నారు. స్థాని పవర్‌హౌజ్ కాలనీలో ఇళ్లులేని వారు అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు వీలుగా పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన ముక్తి ఆశ్రమం, విశ్రాంతి భవనాన్ని పుట్ట శైలజతో కలిసి ప్రారంభించారు. కరెంట్ బిల్లు చెల్లించి ముక్తి ఆశ్రమాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

వేతనాలపై పొంతన ఏది..?

- జిల్లాకో రీతిన చెల్లింపు
- కొన్ని జిల్లాల్లో రూ.22,750
- జిల్లాలో మాత్రం రూ.19,500
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- ఇ-పంచాయతీ ఆపరేటర్ల వినతి

జిల్లాలో మండలాలు	14
పంచాయతీలు	266
క్లస్టర్ గ్రామాలు	113
గ్రామాలకు చేరిన కంప్యూటర్లు	134
ఆపరేటర్ల సంఖ్య	40



ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆపరేటర్లు

పెద్దపల్లిరూరల్: ఇ-పంచాయతీ సేవలను పల్లె ప్రజలకు అందించేందుకు పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లాకో రీతిన.. పొంతనలేని విధంగా వేతనాలు చెల్లిస్తున్నారు. జిల్లాలోని 14మండలాల్లో 266 పంచాయతీలు ఉన్నాయి. వాటిని 113 క్లస్టర్లుగా విభజించారు. ప్రతి పంచాయతీకి ఒక కంప్యూటర్ అందించి ఇ-సేవలను అందుబాటులోకి తేవాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేవలం 134 పంచాయతీలకే కంప్యూటర్లు అందించారు. అందులోనూ చాలావరకు మూలన పడేశారు.

మండలకేంద్రాల్లోనే విధులు
పంచాయతీల లావాదేవీలు, ధృవీకరణపత్రాలు, ఇంటి అనుమతులన్నీ ఆన్‌లైన్‌లో చేయాల్సి రావడం.. అవసరమైనన్ని కంప్యూటర్లు, ఆపరేటర్లు లేకపోవడంతో మండల పరిషత్ ఆఫీసుల నుంచే పనులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 266 పంచాయతీల విధులను కేవలం 40 మంది ఆపరేటర్లతోనే నెట్టుకొస్తున్నారు. ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారంతా తమకు పనిభారం ఎక్కువవుతోందని, సమానపనికి సమాన వేతనం అందడం లేదని వాపోతున్నారు. ఇచ్చే వేతనాలను సైతం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రీతిన చెల్లించకపోవడం దారుణమంటున్నారు. 2015లో క్వారీ అనే సంస్థ 15నెలల ఒప్పందంతో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకుని రూ.11వేల వరకు వేతనం చెల్లించింది. తర్వాత 2016 ఏప్రిల్ నుంచి ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియమించి 14వ ఆర్థికసంఘ నిధులనుంచి 10శాతం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. కొన్ని జిల్లాల్లో రూ.22,750 చెల్లిస్తుండగా.. మరి కొన్ని జిల్లాల్లో రూ.19,500, రూ.17,500 చొప్పున వేతనం అందిస్తున్నారని ఆపరేటర్లు పేర్కొంటున్నారు. ఇలా జిల్లాకో రీతిన వేతనాలు చెల్లిస్తుండడంతో తమకు తీరని అన్యాయం జరుగుతోందని జిల్లాకు చెందిన ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి
జిల్లాకు చెందిన పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు తమ వేతనాలను పెంచి ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీని ఇటీవల కలిసి వేడుకున్నారు. తక్కువ పంచాయతీలు ఉన్న మండలాల్లో పనిచేస్తున్న పొరుగు జిల్లా ఆపరేటర్ల కన్న తమకు తక్కువ వేతనం ఇస్తున్నారని వాపోయారు. ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న పనులు, కార్మికుల వివరాలతోపాటు లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లో జరపాల్సి ఉందని, పనికి తగ్గ వేతనాన్ని ట్రెజరీలో చెల్లించేలా చూసి ఉద్యోగభద్రతను కల్పించాలని ఆపరేటర్లు కోరుతున్నారు.



కలెక్టర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



తిలక్‌నగర్‌లోని ఐలమ్మ విగ్రహం వద్ద ఆర్డీఓ తదితరులు

ఐలమ్మకు ఘన నివాళి

పెద్దపల్లిరూరల్: సాయుధ పోరాట స్ఫూర్తిని చాటిచెప్పిన వీరవనిత ఐలమ్మ అని ఆర్డీఓ మధుమోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం బీసీసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతిలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళాశక్తికి ప్రతీకగా ఆమె పోరాటం చరిత్రలో నిలిచిందన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి ఉన్నారు.

ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం
ఐలమ్మ జీవితం సమాజానికే స్ఫూర్తిదాయకమని రజకసంఘనాయకులు పేర్కొన్నారు. తిలక్‌నగర్‌లో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. సంఘం నాయకులు లక్ష్మణ్, రాజయ్య, కనకయ్య, రాయగట్టు, రాజు, వాసు, దొడ్డుపల్లి జగదీశ్, నర్సయ్య, రమేశ్, మొండయ్య, తిరుపతి, మల్లికార్జున్, రవి తదితరులున్నారు.

పంచాయతీలకు చేరిన 15వ ఆర్థిక సంఘ నిధులు

- జిల్లాకు రూ.11.92కోట్లు కేటాయింపు



పెద్దపల్లిరూరల్: జిల్లాలోని 266 పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు మంజూరయ్యాయి. రూ.11,92,45,000 నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో రూ.5.41కోట్లు అన్‌టైడ్, రూ.6.51కోట్లు టైడ్ నిధులుగా కేటాయించారు. అన్‌టైడ్ నిధులుగా (40శాతం) కేటాయించిన నిధులను తాగునీరు, శానిటేషన్ పనులకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. టైడ్ నిధులు (60శాతం) స్థానికంగా అవసరమున్న మిగతా ఇతర అవసరాలకు ఖర్చు చేయాల్సి ఉంటుందని పంచాయతీ శాఖ అధికారవర్గాలు తెలిపాయి.

జిల్లాలోని పంచాయతీలకు మంజూరైన నిధులు.. మండలాలవారీగా (రూ.లక్షల్లో)

మండలం	జీపీలు	అన్‌టైడ్	టైడ్	మండలం	జీపీలు	అన్‌టైడ్	టైడ్
అంతర్గాం	16	27.46	31.29	ఓదెల	22	45.03	56.45
ధర్మారం	29	59.50	69.01	పాలకుర్తి	19	42.97	50.15
ఎలిగేడు	12	25.58	29.81	పెద్దపల్లి	30	64.75	79.41
జూలపల్లి	13	33.18	40.04	రామగిరి	17	49.38	61.05
కమాన్‌పూర్	09	26.53	33.36	శ్రీరాంపూర్	24	45.07	55.95
మంథని	34	46.02	51.61	సుల్తానాబాద్	27	48.36	58.22
ముత్తారం	14	27.16	35.11	మొత్తం	266	541.00	651.45

వృద్ధులు, వికలాంగులకు సదావకాశం

- ఇంటి వద్దనే ఓటేసేలా చర్యలు
- కసరత్తు చేస్తున్న ఎన్నికల సంఘం
- రహస్య ఓటింగ్ ద్వారా ఓటు వినియోగం..?

సుల్తానాబాద్: ఓటింగ్ శాతం పెంచడంతోపాటు ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. వృద్ధులు, వికలాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఇబ్బంది పడకుండా వారికి ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తోంది. ఎన్నికల సమయంలో ముఖ్యంగా దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి ఇక్కట్లు తొలగించడంతోపాటు ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ఇంటి వద్దే ఓటు వేసేలా అవకాశం కల్పించింది. కర్ణాటకలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని అమలు చేసింది. అక్కడ విజయవంతం కావడంతో మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈ నిర్ణయం వల్ల వయోవృద్ధులు, కదల్లేని స్థితిలో ఉన్నవారికి, దివ్యాంగులకు మేలు చేకూరనుంది.

ఏర్పాట్లు ఇలా..
జిల్లాలో దివ్యాంగులు 10,221 మంది ఉన్నారు. సీనియర్ సిటిజన్లు 10,683 మంది ఓటర్లు ఉన్నారు. రహస్య బ్యాలెట్ విధానం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఓ వ్యానును ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అందులో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ను ఉంచుతారు. అందులో ఉండే పోలింగ్ అధికారి ఓటరుతో రహస్యంగా ఓటేయిస్తారు. దీనిపై ఉన్నతాధికారులు ఇప్పటికే వయోవృద్ధుల సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వృద్ధులు, దివ్యాంగులు స్థానికంగా ఉండే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ విధానం ఎలా ఉంటుందనే దానిపై ఇంకా మార్గదర్శకాలు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

అందుబాటులో మూడు చక్రాల కుర్చీ
ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే దివ్యాంగులు లోపలికి వెళ్లేందుకు ర్యాంప్ ఏర్పాటు చేస్తారు. నడవలేని వారికి మూడు చక్రాల కుర్చీ అందుబాటులో ఉంచుతారు. ప్రతి కేంద్రంలోనూ ఈ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

క్లుప్తంగా

గుగ్గూస్ వరకు బస్సు నడపాలి



పుట్ట మధుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గుగ్గూస్ వాసులు

మంథని: మంథని నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్ వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను గుగ్గూస్ వరకు నడిపేలా చొరవ చూపాలని ఆ ప్రాంతానికి చెందినవారు ఆదివారం మంథనిలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధును కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాకు చెందిన అనేక మంది ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం గుగ్గూస్‌లో స్థిరపడ్డారని, తరచూ అటు నుంచి ఇటు ప్రయాణాలు చేస్తుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ప్రయాణ సౌకర్యానికి అవకాశం లేకపోవడం వల్ల ప్రైవేటును ఆశ్రయిస్తున్నామని, ప్రైవేటులో భద్రతో లేదని, పైగా మహారాష్ట్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న క్రమంలో ఒంటరిగా వచ్చే మహిళలకు భాషాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వినతి పత్రం సమర్పించినవారిలో గుగ్గూస్ జిల్లా మున్నూరుకాపు సంఘం జిల్లా కార్యదర్శి సిద్దం శంకర్ తదితరులు ఉన్నారు.

కష్టాలొచ్చినప్పుడు ధైర్యంగా ముందుకెళ్లాలి



సమావేశంలో అశోక్ తదితరులు

పెద్దపల్లిరూరల్: కష్టాలొచ్చినపుడు ధైర్యంగా ముందుకు సాగాలే తప్ప.. వాటినుంచి తప్పించుకునేందుకు ఆత్మహత్యలకు పాల్పడవద్దని సైకాలజిస్టు, ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పెద్దపల్లిలో ఆదివారం సమావేశమయ్యారు. మానసిక ఇబ్బందులు, ఒత్తిళ్లకు లోనై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యే శరణ్యమనుకునే వారిలో ధైర్యాన్ని నింపి భరోసా కలిగించాలన్నారు. గత పదేళ్ల కాలంలో 28 మందిని కాపాడడం సంతృప్తినిచ్చిందన్నారు. నాయకులు వేముల రామ్మూర్తి, సదానందం, నర్సయ్య, పవన్, శుభ తదితరులున్నారు.

ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు




శివాలయంలోని ధ్వజస్తంభం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలోని శ్రీనాగలింగేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి ఆదివారం ఇత్తడి తొడుగు వేయించారు. రాష్ట్ర పోలీస్‌హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ సొంత ఖర్చుతో ఈ తొడుగు చేయించారని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రావణ్‌శర్మ తెలిపారు. గ్రామపెద్దలు జగన్నాథం, సత్యనారాయణ, లింగయ్య, కనకయ్య, తిరుపతి, ఆనందం తదితరుల పాల్గొన్నారు.

ప్రతిభ ప్రతిబింబించేలా..

- విద్యార్థుల విజ్ఞానానికి చక్కని వేదిక మంథన్
- ఈనెల 15 దరఖాస్తులకు చివరి తేదీ

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై ఆసక్తి కలిగించడం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో భారతీయుల కృషి తెలియజేసే ఉద్దేశమే విద్యార్థి విజ్ఞాన్ మంథన్. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభ పరీక్ష నిర్వహిస్తోంది.



వీవీఎం లోగో

పరిశోధన సంస్థల సందర్శన

- పలు జాతీయ ప్రయోగశాలల సందర్శనతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందుకునే అరుదైన అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తోంది.
- ఇందులో డీఆర్డీవో, బార్క్, సీఎస్ఐఆర్ వంటి ప్రఖ్యాత పరిశోధన సంస్థలున్నాయి. వాటిని సందర్శించే అవకాశంతో పాటు మూడు వారాలు ఇంటర్న్‌షిప్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహిస్తోంది.
- ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆ ప్రయోగశాలల సందర్శనతో కొత్త స్ఫూర్తి పొందే అవకాశముంది. 2024 సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయి పరీక్ష మే 18, 19న నిర్వహించనున్నారు.
- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 6 నుంచి 11వ తరగతి (ఇంటర్ ప్రథమ సంవత్సరం) విద్యార్థులకు ఆన్‌లైన్ వేదికగా ఈ పరీక్ష నిర్వహిస్తారు.
- 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్లుగా, 9 నుంచి 11 వరకు సీనియర్లుగా పరిగణిస్తారు. ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, రాష్ట్ర బోర్డు విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు.

జిల్లాస్థాయిలో ఇలా..

జిల్లాలో ఆరో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రతి తరగతిలో ప్రతిభచూపిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం 18 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు.

రాష్ట్రస్థాయిలో..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభచూపిన మొదటి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి మొత్తం 120 మందిని రాష్ట్రస్థాయికి పంపుతారు. అత్యంత ప్రతిభకనబర్చిన 18 మందిని రాష్ట్రస్థాయి విజేతగా ప్రకటిస్తారు. వారిలో మొదటి ముగ్గురికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున ప్రోత్సహకాలిస్తారు.

జాతీయ స్థాయిలో..

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చినవారి నుంచి 18 మందిని జాతీయ ప్రతిభావంతులుగా గుర్తిస్తారు. వీరిని హిమాలయన్స్ అంటారు. రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ప్రోత్సాహకాలు ఇస్తారు. వీటితో పాటు నెలకు రూ.2 వేల చొప్పున ఏడాది పాటు ఉపకారవేతనం అందిస్తారు.

దరఖాస్తు ఇలా..

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పోటీలు పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహిస్తారు. www. vvm. org. in వెబ్‌సైట్‌లో రూ.200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 1న నమూనా పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఆంగ్లం విభాగాల్లో పరీక్ష ఉంటుంది.

ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష..

అక్టోబరు 1న నమూనా పరీక్ష ఉంటుంది. అదే నెల 29 లేదా 30న జిల్లాస్థాయిలో పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. సీనియర్, జూనియర్ విభాగంలో 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్ర పాఠ్య పుస్తకాల నుంచి 50 శాతం, విజ్ఞానశాస్త్రం రంగంలో దేశ కృషిపై 20 శాతం, లాజిక్ రీజనింగ్‌కు 10 శాతం, శాస్త్రవేత్త బీర్బల్ సహానీ జీవిత చరిత్రకు 20 శాతం బహుళైచ్చిక ప్రశ్నలు ఉంటాయి.

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల విజ్ఞానానికి మంచి అవకాశం. పరీక్షను విద్యార్థులు వ్యక్తిగతంగా, పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సైన్స్ ప్రయోగాలకు బీజం పాఠశాల స్థాయి నుంచే కలగాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా దీన్ని నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, అభిరుచి కలిగించడం, వారిలోని నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీయడం ఈ పరీక్ష ఉద్దేశం. వీవీఎం పరీక్షలో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

– బి.రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి, పెద్దపల్లి

బొగ్గుబాయి వార్తలు

ఐక్య పోరాటం ఫలించింది



మాట్లాడుతున్న రామమూర్తి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి వ్యాప్తంగా మైనింగ్ సిబ్బంది ఐక్యపోరాటం ఫలించిందని సింగరేణి మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ కన్వీనర్ మాదాసి రామమూర్తి అన్నారు. ఆదివారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. సింగరేణిలోని గనివృత్తి శిక్షణ కేంద్రాల్లో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు విధులు నిర్వహించడానికి జారీ చేసిన సర్క్యులర్ రద్దు చేయాలని సింగరేణి మైనింగ్ స్టాఫ్ ఐక్యతతో చేసిన పోరాటంతో యాజమాన్యం స్పందించింద సదరు సర్క్యులర్‌ను నిలుపుదల చేసిందని పేర్కొన్నారు. మైనింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకు ఐక్యంగా ఉండి అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. సంస్థ అభివృద్ధిలో సూపర్‌వైజర్లు, అధికారుల పాత్ర కీలకమైందన్నారు. మెడికల్ అన్‌ఫిట్ అయినా, ప్రమాదాలకు గురైన మైనింగ్ సిబ్బందికి ఓపెన్ కాస్ట్, సర్ఫేస్ విభాగాల్లో అదే హోదాలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. తమ పోరాటానికి సంఘీభావం తెలిపిన కార్మికులు, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ కో కన్వీనర్ నాగేల్లి సాంబయ్య, బత్తుల రమేష్, అక్రమ్, దండు రమేష్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అజయ్, నాగ ప్రసాద్, గోపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాటాలతోనే ఏరియర్స్ చెల్లింపు



మాట్లాడుతున్న వైవీ రావు

రామగిరి(మంథని): కార్మికుల పక్షాన ఏఐటీయూసీ దశలవారీగా పోరాటాలు చేయడం వల్లే సింగరేణి యాజమాన్యం ఏరియర్స్ చెల్లింపునకు అంగీకారం తెలిపిందని ఆ సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు అన్నారు. ఆదివారం సెంటనరీకాలనీ కెఎల్ మహేంద్రభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కోల్‌ఇండియా మాదిరిగా ఒకే దఫా 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకవచ్చిన నేపథ్యంలో యాజమాన్యం ఒప్పుకుందన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యమని, కార్మికుల పక్షాన ఎల్లప్పుడు పోరాడేది ఏఐటీయూసీ మాత్రమేనన్నారు. గుర్తింపు సంఘంతో కార్మికులకు ఒరిగేది ఏమి లేదని, యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. సమావేశంలో బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి, సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచందర్, నాయకులు రవి, రాజేష్, రాజయ్య, మల్లేష్, మొండయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గురు భవాని

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక విఠల్‌నగర్‌లో శ్రీ భవానీదీక్ష యజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మహంకాళి అమ్మవారి బోనాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపకుడు కట్ట సురేశ్ గురు భవాని మాట్లాడుతూ, ప్రజల కష్టాలు తొలగిపోవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ రజిత, నాయకులు పెద్దపల్లి రామస్వామి, సదానందం, వెంకటేష్, సతీష్, రాంబాబు, రాజేశ్వరి, విజయ, ఓంకారి తదితరులు పాల్గొన్నారు.

అబ్బ మహేందరూ..

ఉదయం కాంగ్రెస్ కండువా.. సాయంత్రం బీఆర్ఎస్ పంచన



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రాజ్‌ఠాగూర్



గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జంప్ జిలానీలు మొదలయ్యారు. పొద్దున ఒకపార్టీ.. సాయంత్రం మరో పార్టీ తీర్థం తీసుకుంటున్నారు. స్థానిక 9వ డివిజన్ బీఆర్ఎస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జనగామ మహేందర్ ఆదివారం ఉదయం ఎంఎస్ రాజ్‌ఠాగూర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకున్నారు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ సాయంత్రానికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గులాబీ కండువా కప్పి సొంతగూటికి ఆహ్వానించారు. ఇలా జంప్‌జిలానీ తీరు చర్చనీయాంశంగా మారింది.

కారుమబ్బుల్లో 'వెలుగు' రేఖ



జ్యోతినగర్: కారుమబ్బుల్లో ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు కనువిందుగా కనిపించింది. ఎన్టీపీసీ సంస్థ నిర్మించిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండు యూనిట్లలో మొదటి యూనిట్ ఇటీవలే 72 గంటల విద్యుత్ ఉత్పత్తి ట్రయల్ రన్ సక్సెస్ అయింది. ఆదివారం రాత్రి చీకట్లో ప్లాంటు విద్యుత్ కాంతులతో ఇలా కనిపించింది.

అంగన్‌వాడీలకు శుభవార్త

- 65ఏళ్లు నిండినవారికి ఉద్యోగ విరమణ
- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ విరమణ ఇవ్వనున్నట్లు తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించింది. మలి వయసులో శరీరం సహకరించక, ఉన్న ఉద్యోగం వదులుకోలేక నానా అవస్థలు పడుతున్న అంగన్‌వాడీలకు ఉపశమనం కల్గించింది. ఇప్పటి వరకు నిర్దిష్ట ఉద్యోగ విరమణ వయసు ఉండేది కాదు. జిల్లా వ్యాప్తంగా పని చేసే అంగన్‌వాడీ సిబ్బందిలో నాలిగింట ఒక వంతు మలి వయసు వారే. కొన్ని చోట్ల అయితే వారి కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరితోనో, లేదంటే వారి స్థానంలో మరొకరితో పని చేయించేవారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా మానవత దృక్పథంతో చూసీచూడనట్లు వ్యవహరించిన ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వ తాజా ప్రకటన మలివయసు వారికి ఓదార్పు ఇచ్చినట్లు అవుతుంది

శరీరం సహకరించకున్నా..

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 60 ఏళ్లకు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 61 ఏళ్లకు విశ్రాంత ఉద్యోగులవుతున్నారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయాల పై ఉంటుంది. పదుల సంఖ్యలో పిల్లలను జాగ్రత్తగా గమనించాలి. ఇంతకాలం శరీరం సహకరించకున్నా 75 ఏళ్లు దాటిన సిబ్బంది సైతం విధుల్లో కొనసాగుతూ వచ్చారు. ఇక నుంచి వారందరికీ సాంత్వన చేకూరనుంది.

స్వచ్ఛంద విరమణకు పెరిగిన డబ్బులు

ఇక నుంచి 65 ఏళ్ల వయసు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు ఉద్యోగ విరమణ పొందాలి. టీచరుకు రూ.లక్ష, సహాయకురాళ్లకు రూ.50 వేల ప్యాకేజీ చెల్లిస్తారు. ఇప్పటి వరకు అయితే స్వచ్ఛందంగా పని చేయలేమని విరమించుకున్న అంగన్‌వాడీ టీచర్ల రూ.60 వేలు, సహాయకులకు రూ.30 వేలు మాత్రమే చెల్లించేవారు.

జిల్లాలో..

జిల్లా వ్యాప్తంగా 3 ఐసీడీఎస్ ప్రాజెక్టులు మంథని, పెద్దపల్లి, రామగుండంలో ఉన్నాయి. వాటి పరిధిలో 706 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో పదుల సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు 70 ఏళ్లకు చేరువలో ఉన్న సిబ్బంది సైతం విధుల్లో కొనసాగుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో..



ఉద్యోగ విరమణ వయసు విషయంలో స్పష్టత లేకపోవడంతో ఇప్పటి వరకు మలి వయసు వారెందరో విధుల్లో కొనసాగారు. మారుతున్న కాలనుగుణంగా వారు ట్రాకింగ్ సిస్టమ్ సహ పలు విషయాల్లో వెనుకబడిపోతున్నారు. ప్రభుత్వ నిర్ణయం అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుంది.

– రవుఫ్, జిల్లా సంక్షేమ అధికారి, పెద్దపల్లి

శుభవార్త చెప్పిన సర్కార్



ఇంట్లో ఒక్కరిద్దరు పిల్లలుంటేనే వారిని అదుపులో ఉంచడం కష్టం. అలాంటిది పదులో సంఖ్యలో ఉండే అంగన్‌వాడీ కేంద్రాల్లో వయసు పెరిగి, శరీరం సహకరించని వారు విధులు నిర్వర్తించడం చాలా కష్టం. మలి వయసు సిబ్బందికి ప్రభుత్వ ప్రకటన శుభవార్త చెప్పినట్లే అయింది.

– ప్రభావతి, అంగన్‌వాడీ టీచర్, ధూళికట్ట

జీవితం కవిత్వానికి కొలమానం

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి



సన్మానిస్తున్న సిధారెడ్డి తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కవిత్వానికి జీవితమే కొలమానం అని, తెలంగాణ నేల కొత్తశక్తిని అందిస్తుందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన కాళోజీ పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవిత్వానికి రూపం, శిల్పం అలంకారాలు మాత్రమేనని రమ్యం కాదని, సామాన్య మానవుడిని ఒప్పించేది మాత్రమే కవిత్వంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కవిత్వానికి కులాలు, మతాలతో సంబంధమే లేదన్నారు. మంచి కవిత్వం పది కాలాలపాటు నిలిచిపోతుందని వివరించారు. ప్రైజ్ మనీతో సంబంధం లేకుండా హృదయంతో ఇచ్చే పురస్కారం ప్రోత్సాహాన్ని అందిస్తుందని, అదే కాళోజీ నారాయణరావు పేరిట అందించే ఈ పురస్కారమని వెల్లడించారు. కవులకు పురస్కారాలు ప్రేరకాలుగా ఉంటాయన్నారు. అనంతరం ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములుకు 2023వ సంవత్సరానికిగాను కాళోజీ పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, రూ.2వేల నగదు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్, గంద్ర లక్ష్మణ్‌రావు, దాస్యం సేనాధిపతి, వేణు, కేఎస్ అనంతాచార్య, గుర్రాల మాధవ్, బొమ్మకంటి కిషన్, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, గులాబీల మల్లారెడ్డి, చిందం సునీత, బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9,10వ తేదీల్లో నిర్వహించిన 33వ నేషనల్ లెవల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో గోదావరిఖని విద్యార్థులు సత్తాచాటారు. పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గోదావరిఖనిలోని ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 11 మంది జి.అక్షయ్‌పటేల్, ఎస్.సాయిదీపక్, ఎ.సాయి అమృత్, పి.కిరణ్మయి, పి.తన్మయి, ఆర్.మనోజశ్మిక, ఆర్.రుషిక, టి.సాత్విక్, టి.వర్షిత్, ఎ.కుమార్, బి.నవదీప్ ప్రతిభకనబరచి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ మొండయ్య, సీనియర్ కోచ్ క్రాంతి కుమార్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న మాస్టర్లు

ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో..

జ్యోతినగర్(రామగుండం): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సుమంగల్ ఫంక్షన్ హాల్‌లో ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2023, సీఐ చక్రపాణి, ఏఎస్ఐ మదన్‌మోహన్, కానిస్టేబుల్ అశోక్ మెమోరియల్ కరాటే టోర్నమెంట్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి జపాన్ షిటోరియో కరాటే స్కూలు విద్యార్థులు కటాస్, కుమితి విభాగాల్లో బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను, కరాటే కోచ్ శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియా కరాటే స్కూల్ ప్రెసిడెంట్ ఎం.రమేష్, శ్రీనివాస్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బాణేష్‌రావు, స్పందన క్లబ్ సెక్రటరీ త్రివేది, చిరంజీవి ఆదిత్య, వంశీకృష్ణ అభినందించారు.

బస్సు కిందపడి మృతిచెందిన యువకుడి గుర్తింపు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు కిందపడి మృతిచెందిన యువకుడిని గుర్తించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం నర్సింగపూర్ జిల్లా గోరఖ్‌పూర్‌కు చెందిన అఖిత్‌దేహారియా (25)గా గుర్తించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. వివరాలు.. అఖిత్‌తో పాటు మరో ఇద్దరు యువకులు కొంతకాలం క్రితం కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో కూలీ పనికి వెళ్లారని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో వస్తూ పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో దిగారు. బస్టాండ్ వైపునకు వచ్చి తిరిగి రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా ఆర్టీసీ బస్సు కిందపడి మృతిచెందాడు. మృతుడి బంధువు దేవీసింగ్ దేహారియా ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గండిలచ్చపేటకు చెందిన బొమ్మెన సమ్మయ్య ట్రాలీ ఆటలో 5 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. బియ్యం, ట్రాలీ ఆటోను స్టేషన్‌కు తరలించి, సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.